సాక్షి
శ్రీకాకుళం
బుధవారం ♦ 4 ♦ అక్టోబర్ ♦ 2023



రైతుకు తీపి కబురు

ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మద్దతు ధర కూడా ప్రకటించారు.

- 8లో



దాసన్న డబుల్ హ్యాట్రిక్

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ధర్మాన కృష్ణదాస్ ఎన్నికయ్యారు. దీంతో డబుల్ హ్యాట్రిక్ కొట్టారు.

- 8లో

జూనియర్ అసిస్టెంట్ పోస్టుల తుది జాబితా విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్న జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి తెలిపారు. ఆ నోటిఫికేషన్‌కి సంబంధించిన తుది జాబితా srikakulam.ap.gov.in లో ఉందని తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 4 నుంచి 10వ తేదీలోగా కలెక్టర్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

న్యూస్‌రీల్

కొత్తమ్మ తల్లి ఉత్సవాలకు ప్రత్యేకాధికారుల నియామకం

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల ఇష్టదైవం కొత్తమ్మ తల్లి ఉత్సవాలు ఈనెల 17 నుంచి 19 వరకు జరగనున్న నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణ కోసం 14 మంది అధికారులను నియమించారు. ఈ మేరకు దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎం.వెంకటసురేష్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పి.ప్రభాకరరావు (శ్రీముఖలింగం ఈఓ), బి.రామారావు(సోంపేట ఈఓ), సీహెచ్ ప్రభాకరరావు, ఎస్.నాగేశ్వరరావు, సీహెచ్ కోదండ, ఎ.శ్రీనివాసరావు, ఎస్‌వీబీ రెడ్డి, పీవీ రమణ, శ్రీనివాసరావు, పి.ప్రభాకరరావు, పి.అనురాధ, శ్రీరామ్, మురళీనాయుడు, ఎంవీ బలరాం నాయుడులను ఉత్సవాలకు ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు. అలాగే ఉత్సవాల నిర్వహణపై బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయం కమిటీ హాల్‌లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

'క్లెయిమ్స్ పరిష్కారానికి సిద్ధంగా ఉండాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన ఓటర్ల జాబితా కూర్పులో భాగంగా ఫారం 6, 7, 8 కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. నోటీసులు జారీ చేసే ప్రక్రియ వెబ్‌సైట్ అందుబాటులోకి రాగానే పూర్తి కావాలని సూచించారు. అప్పటి వరకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు. కలెక్టర్‌తో పాటు జేసీ ఎం.నవీన్, డీఆర్‌ఓ ఎం.గణపతి రావు సమావేశానికి హాజరయ్యారు. బుధవారం నుంచి ఈవీఎంల వెరిఫికేషన్ చేపట్టి 14 లోగా పూర్తి చేస్తామని వివరించారు.

క్రీడాసామగ్రి పరిశీలన



క్రీడా పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: శాప్ నుంచి వచ్చిన క్రీడా సామగ్రిని మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తన కార్యాలయంలో పరిశీలించారు. జిల్లాలో 737 సచివాలయాలకు ఈ పరికరాల కిట్‌లను అందజేస్తామని క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ ప్రసాదరావు కలెక్టర్‌కు తెలిపారు. కిట్ విలువ సుమారుగా రూ.25వేలు ఉంటుందని అన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ వంటి పరికరాలు ఉంటాయని వివరించారు.

నేడు మహిళా కళాశాలలో మూల్యాంకనం మొదలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో బుధవారం నుంచి మూల్యాంకనం మొదలుకానుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లోని 4వ సెమిస్టర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. మూల్యాంకనంలో హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్, మాథ్స్, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ సబ్జెక్టులకు సంబంధించిన పేపర్స్ వచ్చాయని వెల్లడించారు. ఆయా సబ్జెక్టులకు చెందిన చీఫ్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లు హాజరుకావాలని కోరారు. బుధవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని, సమయపాలన ముఖ్యమని ప్రిన్సిపాల్ సూర్యచంద్ర సూచించారు.

ప్రతి బుధవారం జగనన్నకు చెబుదాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిర్దేశిత మండల కేంద్రాల్లో ప్రతి బుధవారం జగనన్నకు చెబుదాం(జెకెసి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. ఈ మేరకు అక్టోబర్ నెల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 4న కొత్తూరు, 11న సంతబొమ్మాళి, 18న గార, 25న కవిటి, మండల ప్రధాన కేంద్రాల్లో జేకేసీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. షెడ్యూల్డ్ మండలాల్లో మండల స్థాయి జేకేసీపై అన్ని గ్రామాల్లో భారీ ప్రచారం కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదులపై తక్షణ పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు కార్యక్రమాల్లో సమగ్ర సమాచారంతో పాల్గొనాలని సూచించారు.

అమ్మకు రక్షణ



- సిజేరియన్ల తగ్గింపునకు వైద్య శాఖ ప్రత్యేక చర్యలు
- 'సీ-సేఫ్' పేరిట సహజ ప్రసవాల పెంపునకు ప్రణాళికలు
- ప్రభుత్వం ఎంపిక చేసిన ఆస్పత్రులు వైద్యులు, సిబ్బందికి శిక్షణ

బూర్జ : సిజేరియన్.. వైద్య శాఖను ప్రస్తుతం భయపెడుతున్న పేరు. అవసరమైన సందర్భాల్లో మాత్రమే ఉపయోగించాల్సిన ఈ విధానాన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇష్టానుసారంగా వాడేస్తుండడంతో బాలింతల ఆరోగ్యం తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఒకప్పటి తరమంతా ప్రసవ వేదన అనుభవించిన వారే. కానీ కాలం మారి వైద్య సదుపాయాలు పెరిగాక చాలా మంది ఆపరేషన్ల వైపు మొగ్గు చూపిస్తున్నారు. గర్భధారణ సమయాల్లో వచ్చే ఇబ్బందులను, కాన్పు సమయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు మాత్రమే వైద్యులు సిజేరియన్ విధానాన్ని పాటిస్తారు. కానీ ఇప్పుడు పరిస్థితి హద్దు మీరిపోతోంది. ఈ గణాంకాలు కూడా ఆందోళనకరంగా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకువచ్చేందుకు వైద్య శాఖ నడుం బిగించింది. అనవసర సిజేరియన్ల వల్ల వచ్చే అనర్థాలు, సహజ ప్రసవాలతో కలిగే మేలును గర్భిణులకు తెలియజేస్తూ సహజ ప్రసవాలను ప్రోత్సహించేందుకు 'సీ-సేఫ్' విధానానికి రూపకల్పన చేసి అమలు చేయడానికి ప్రణాళిక రచించింది.

జిల్లా వైద్య శాఖ గణాంకాల ప్రకారం మొత్తం ప్రసవాల్లో 45 శాతం వరకు సిజేరియన్లే ఉంటున్నాయి. వాస్తవానికి డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాల ప్రకారం ఈ శాతం 10–15లోపునే ఉండాలి. ప్రైవేటు ఆస్పత్రుల్లో అయితే 50 శాతానికిపైగా ఆపరేషన్లు జరుగుతున్నాయి. ఈ అనవసర శస్త్ర చికిత్సల వల్ల బాలింతలు ఆరోగ్య పరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితులు నివారించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీ-సేఫ్‌ను ప్రారంభించనున్నారు.

నర్సులకు శిక్షణ..

సహజ ప్రసవాలు పెంచే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వాస్పత్రుల్లోని నర్సులకు నర్స్ ప్రాక్టీషనర్ ఇన్ మిడ్ వైఫరీ(ఎన్‌పీఎం) కోర్సులో శిక్షణ అందించారు. బ్యాచ్‌కు 30 మంది చొప్పున రెండు బ్యాచ్‌లకు గుంటూరు, తిరుపతిలో 18 నెలలు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో గర్భధారణ జరిగినప్పటి నుంచి మహిళలకు అవసరమైన వైద్య సాయం ఎలా అందజేయాలో వివరిస్తారు. హైరిస్క్‌లో ఉన్న గర్భిణులను ఎలా గుర్తించాలి, వారికి ఏ విధమైన వైద్యం అందించాలనే అంశాలపై శిక్షణ ఇస్తారు. శిక్షణ అనంతరం వీరికి నర్సింగ్ బోర్డులో పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. త్వరలో వీరికి రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా ప్రసవాలు జరిగే 10 ఆస్పత్రుల్లో నియమించనున్నారు.

ఏం చేస్తారు..

సీ-సేఫ్ ప్రణాళిక అమలులో భాగంగా అవసరమైన సందర్భాల్లో మాత్రమే సిజేరియన్లు చేయాలని చెబుతారు. దీనిపై వైద్యులకు నిర్దిష్టమైన మార్గ దర్శకాలు జారీ చేస్తారు. సిజేరియన్ విధానాలతో మాతృశిశు మరణాలు రాకుండా చర్యలు తీసుకుంటారు. ఆపరేషన్ చేసేటప్పుడు అత్యంత సురక్షిత పద్ధతులు పాటించాలని సూచిస్తారు. ఈ విధానానికి యునిసెఫ్ కూడా సహకారం అందజేస్తోంది.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం

సిజేరియన్ల తగ్గింపే లక్ష్యం



సిజేరియన్ల తగ్గింపే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అనవసర ప్రసవాల నియంత్రణకు కృషి చేస్తోంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్‌లు నియంత్రించడానికి 'సీ-సేఫ్' చక్కటి ప్రణాళిక. క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేస్తే సులభంగా నియంత్రించవచ్చు.

– డాక్టర్ జి.రాజశేఖర్, బూర్జ పీహెచ్‌సీ వైద్యులు

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట



మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే మాతృ మరణాల కట్టడికి అనేక చర్యలు తీసుకుంది. ఫలితంగా గతంతో పోలిస్తే మరణాలు తగ్గాయి. అదేవిధంగా అనవసర సిజేరియన్ కాన్పుల నియంత్రణపై దృష్టి సారించాలి. ఈ క్రమంలోనే సీ-సేఫ్ ప్రణాళిక రచించాం. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ సిజేరియన్లను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డీఎంహెచ్‌ఓ

ఐటీఐల్లో ప్రవేశానికి ఐదో విడత కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో ఖాళీ సీట్లలో ప్రవేశానికి ఐదో విడత నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కౌన్సెలింగ్ కోఆర్డినేటర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం వివరాలు వెల్లడించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ఐటీఐ.ఏపీ.సీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం రిజిస్ట్రేషన్ చేసుకున్న దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో సమీపంలోని ప్రభుత్వ ఐటీఐకి 7, 8 తేదీల్లో దరఖాస్తు పరిశీలనకు హాజరు కావాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐల్లో ఈ నెల 9వ తేదీన, ప్రైవేట్ ఐటీఐల్లో ఈ నెల 10న కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

సహిత విద్య ఉద్యోగాలకు సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్న స్క్రూటినీ కమిటీ

శ్రీకాకుళం న్యూకాలనీ: సహిత విద్యా (భవిత) కేంద్రాల్లో రిసోర్స్ పర్సన్ల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 17 రిసోర్స్ పర్సన్ల పోస్టులకుగాను 172 మంది అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. వీరి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియలో భాగంగా జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కార్యాలయంలో తొలిరోజు వీఐ/హెచ్‌ఐ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఈ పోస్టులకు 69 మంది దరఖాస్తులు చేసుకోగా.. ఇందులో 59 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. అన్ని విద్యార్హతలను తెలిపే ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, సర్వీస్/ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లను నిశితంగా పరిశీలించారు. బుధవారం ఎంఆర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. ఎంఆర్ విభాగానికి 103 మంది దరఖాస్తులు చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

జాలర్లకు ఉపాధి చూపేందుకే ఫిష్ ఆంధ్ర



ఫిష్ ఆంధ్రా స్టాల్స్‌ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జాలర్లకు ఉపాధి చూపేందుకే ఫిష్ ఆంధ్రా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పొన్నాడలో ఫిష్ ఆంధ్రా స్టాల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. మొత్తం ఐదు స్టాళ్లను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఒక్కో ఔట్‌లెట్‌కు మూడున్నర లక్షల రూపాయలు కేటాయించారు. ఇక్కడ పనిచేసేందుకు అంతా మహిళలనే ఎంపిక చేశారు. ఇప్పటికే గుజరాతీపేటకు ఆనుకుని పాలిటెక్నిక్ కళాశాల వద్ద 19 ఔట్ లెట్లను ప్రారంభించారు. అలాగే చేప పిల్లల రవాణాకు రూ.13.39 లక్షలు వెచ్చించి వాహనం కొనుగోలు చేశారు. దీన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. మంచి చేపలను పౌరులకు అందించాలనే సంకల్పంతో ఫిష్ ఆంధ్రాకు రూపకల్పన చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కింది స్థాయిలో ఉండే వర్గాలకు పెద్దఎత్తున సహాయం అందిస్తున్నామన్నారు. వేటకు వెళ్లి చనిపోయిన వారికి రూ.10 లక్షలు పరిహారం కింద అందిస్తున్నామన్నారు. మంచినీళ్లపేట వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయితే వలసలు ఆగుతాయన్నారు. మూలపేట పోర్టు పూర్తయితే ప్రపంచంతో మన జిల్లాకు సంబంధాలు ఏర్పడతాయని తెలిపారు. మామ ఎన్టీఆర్‌ను హింసించిన చంద్రబాబును ఎవ్వరూ నమ్మరని, బాబు అబద్ధాలకు విలువ లేదన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు రావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జెడ్పీటీసీ రుప్ప దివ్య, ఫిషరీస్ జేడీ శ్రీనివాస్ రావు, ఎఫ్‌డీఓ గంగాధర్, పొన్నాడ రుషి, శ్రీనివాస్ పట్నాయక్, గంగు నరేంద్ర, సురాడ సూర్యం, గురుమూర్తి, పోలీసు, శ్రీరామ్, గనగల్ల రాములు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు



• ధర్మప్రచార వారోత్సవాలు

అరసవల్లి: అరసవల్లి ఆదిత్య క్షేత్రంలో బుధవారం నుంచి ధర్మ ప్రచార వారోత్సవాలు జరగనున్నాయి. మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం ఉదయం గోపూజతో కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తగిన ఏర్పాట్లు చేశారు. బుధవారం షెడ్యూల్ ప్రకారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు త్రిచ సౌర అరుణ ప్రయుక్త సూర్యనమస్కారాలు, 8 గంటల నుంచి 9 గంటల వరకు వేదపారాయణాలు జరుగుతాయి. గోపూజ అనంతరం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఉపనిషత్ పారాయణాలు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నాదస్వర కచేరి, అలాగే ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు శ్రీధన్వంతరీ హోమం, సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు పులఖండం శ్రీనివాసరావుతో పురాణ ప్రవచనాల కార్యక్రమాలు జరుగుతాయని ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు.

• వర్సిటీలో సదస్సు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నూతన విద్యా విధానం-2020 అమలు, సవాళ్లు అంశంపై బుధ, గురువారాల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. జాతీయ స్థాయిలో విద్యారంగ నిపుణులు, వర్సిటీ అధికారులు పాల్గొంటారు. ఇప్పటికే 10 వరకు పరిశోధకులు పేపర్ ప్రజెంటేషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విద్యా సంబంధిత సంస్థల భాగస్వామ్యంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ హనుమంతు సుబ్రహ్మణ్యం తెలిపారు.

• ఎన్ఐఏ తీరుపై నిరసనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ దర్యాప్తు సంస్థ ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా న్యాయవాదుల ఇళ్లలో సోదాలు చేయడం సరికాదని జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు మంగళవారం బార్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఎన్ఐఏ చట్టంపై, ఇటీవల న్యాయవాది ఇంటిపై పోలీసులు చేసిన దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ చట్టంలో మినహాయింపులు చేయాలని, న్యాయవాదులపై దాడులు లేకుండా చేయాలని వారు తీర్మానించారు. బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపనున్నామని, న్యాయవాదులంతా సహకరించాలని కోరారు. సమావేశంలో బార్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పొన్నాడ రాము, బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, వివిధ న్యాయవాద సంఘాల ప్రతినిధులు ఈశ్వరరావు, దుప్పల రమణారావు, కూన అన్నం నాయుడు, శిష్టు రమేష్, ఈశ్వరరావు, పి.లక్ష్మీపతి, బార్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ఊరికి ఊపిరి



నరసన్నపేట: సత్యవరంలో వైద్య పరీక్షల కోసం వచ్చిన గ్రామస్తులు

దశాబ్దాల నిర్లక్ష్యంతో నుస్తీ చేసిన పల్లెలకు వైఎస్సార్ సీపీ సర్కారు ఆరోగ్య సురక్ష పథకంతో చికిత్స చేస్తోంది. ప్రభుత్వ వైద్యులను ఊళ్లకే పంపించి సామాన్యులకు వైద్యం చేయిస్తోంది. వేలాది రూపాయలు ఖర్చు పెడితే గానీ జరగని రక్త పరీక్షలను పూర్తి ఉచితంగా జరిపిస్తోంది. జబ్బు నిర్ధారణ జరిగితే దానికి పూర్తిస్థాయి ట్రీట్‌మెంట్ చేసేంత వరకు వెంటే ఉండి అండగా నిలుస్తోంది. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయి.

మంగళవారం ఆరోగ్య సురక్ష ఇలా..	మండలాలు	హెల్త్ క్యాంపులు	ఓపీలు	రిఫరల్స్
	30	30	7795	299



రణస్థలం మండలం కృష్ణాపురంలో కంటి పరీక్షలు నిర్వహిస్తూ..

వైద్యం బాగుంది



జగనన్న వచ్చిన తర్వాత వైద్యం బాగుంది. గ్రామాల్లోకి వైద్య నిపుణులు వచ్చి వైద్యం అందివ్వడం ఏనాడూ లేదు. ఇక్కడ బీపీ, సుగర్ పరీక్షలు చేస్తున్నారు. ఈ పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లలో ఎంతో డబ్బులు చెల్లించేవాళ్లం.

– కమటాన నాగరాజు, బలద, కొత్తూరు



ఆమదాలవలస మండలం కలివరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఇంటి వద్దే పరీక్షలు చేశారు



రక్త పరీక్ష చేసుకోవాలంటే నానా అవస్థలు పడేవాళ్లం. జ్వరం వచ్చినా మందులు కావాలంటే పేట వెళ్లేవారం. ఇప్పుడు గ్రామంలోనే కేంద్రంలో అన్ని పరీక్షలు చేస్తున్నారు.ఈ రోజు పెద్ద డాక్టర్లను తీసుకువచ్చి మా ఊరిలోనే వైద్యం చేయించారు. మందులు ఇచ్చారు. నాలాంటి వృద్ధులకి ఇంతకన్నా ఏం కావాలి.

– సీమునూరి అప్పమ్మ, సత్యవరం, నరసన్నపేట మండలం

కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు



పేదరికంలో ఉన్న మాలాంటి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష ఆదుకుంటోంది. మా ఊరిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చాం. కళ్లు కనిపించడం లేదని చెప్పగా చీటీ రాసి కంటి డాక్టర్ పరీక్షలు చేశారు. పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ కూడా పూర్తి చేస్తామని వైద్యులు చెప్పారు. – జమ్ము లక్ష్మి, కలివరం గ్రామం, ఆమదాలవలస మండలం

ఊరిలోకి ఆస్పత్రి వచ్చినట్టుంది



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు అడ్డి చిన్నమ్మి. టెక్కలి మండలం రావివలస గ్రామానికి చెందిన ఈమె నరాల సమస్యతో బాధ పడుతుండేవారు. సమస్య వచ్చినప్పుడల్లా టెక్కలి వెళ్లి అక్కడ ప్రైవేటు వైద్యులను ఆశ్రయించేవారు. అయితే ఆ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో, అక్కడ స్పెషలిస్టు డాక్టర్ల వద్దకు వెళ్లి తన సమస్యను విన్నవించారు. దీంతో వైద్యులు ఆమెను పరీక్షించి మందులు ఇచ్చారు. ఊరికి డాక్టర్లు ఎన్నడూ ఇలా రాలేదని, ఊరికే పెద్దాస్పత్రి వచ్చినట్టుందని ఆనందం వ్యక్తం చేశారు.



టెక్కలి: రావివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ దువ్వాడ హైందవి మోహన్, పక్కనే సమన్వయకర్త దువ్వాడ వాణి, ఎంపీపీ సరోజనమ్మ

కిడ్నీ రోగులకు శ్రీరామరక్ష



పలాస: బొడ్డపాడులో మందులు సరఫరా చేస్తున్న వైద్య సిబ్బంది

పలాస: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉద్దానంలోని కిడ్నీ వ్యాధి గ్రస్తులకు శ్రీరామరక్షలా మారింది. ఇక్కడ ఒక్క బొడ్డపాడు పంచాయతీలోని బొడ్డపాడు, మామిడిపల్లి గ్రామాల్లో మొత్తం 40 మంది మూత్ర పిండాల వ్యాధులతో ఉన్నట్టు తెలిసిందని ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టరు కె.విద్యాసాగర్ చెప్పారు. బొడ్డపాడు గ్రామ సచివాలయంలో మంగళవారం ఈ ఆరోగ్య శిబిరాన్ని బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ మద్దిల రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని సలహాలిచ్చారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. సుమారు రూ.లక్ష విలువైన మందులను రోగులకు అందజేసినట్టు రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సునీల్‌కుమార్ చెప్పారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస మండలం సున్నాదేవి పంచాయతీ రామకృష్ణాపురం గ్రామంలో టీడీపీకి చెందిన ఇరవై కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో పలాసలో జెడ్పీటీసీ మచ్చ రత్నాలు, ఏఎంసీ వైస్ చైర్మన్ జినగ లోకేశ్వరిల సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, సీనియర్ నాయకులు మచ్చ ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎంహెచ్ఓ కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శాఖాపరంగా చేపడుతున్న పలు కార్యక్రమాల అమలు తీరు, నిధులు, ప్రగతి నివేదికలు తదితర వివరాలను డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో వివిధ విభాగాల పనితీరును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఎస్.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గార: వమరవల్లి గురుకుల పాఠశాలలో బయోలాజికల్ సైన్సు ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ వై.చిట్టితల్లి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పీజీ, బీఈడీ, టెట్ అర్హతలు కలిగిన వారు ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు.

'సమన్వయంతోనే అభివృద్ధి'



గ్రామ సభ నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ ఐవీ రమణ, సర్పంచ్ సంతోషమ్మ తదితరులు

టెక్కలి: ప్రజలు అధికారులతో సమన్వయంతో ఉంటే అభివృద్ధి సాధ్యమవుతుందని డీఎల్‌పీఓ ఐవీ రమణ అన్నారు. ప్రభుత్వం పంచాయతీల్లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, ఈ క్రమంలో ప్రతి పంచాయతీలో ప్రజలంతా సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని డీఎల్‌పీఓ ఐవీ రమణ సూచించారు. టెక్కలి మండలం గూడేం గ్రామ సచివాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులపై ప్రజలంతా చర్చించుకుని నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ విషయంలో ప్రతి గ్రామం నుంచి ప్రజలు శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట సంతోషమ్మ, వీఆర్‌ఓ భానుమూర్తి, నాయకులు పి.సుధాకర్, జి.లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

'రైతులపై కేసులు ఎత్తి వేయాలి'



బ్లాక్‌డే సందర్భంగా నిరసన తెలియజేస్తున్న రైతు సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): లఖింపూర్ ఖేరీ కేసు ఆందోళనల సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆ గొడవల్లో మరణించిన రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని కోరారు. రైతుల సంస్మరణార్థం అక్టోబర్ 3ని బ్లాక్ డేగా నిర్వహించారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్‌మోర్చా- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో అంబేడ్కర్ కూడలి వద్ద బ్లాక్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహన్, డి.గణేష్, సనపల అన్నాజీరావు, జి.రామకృష్ణ, పోలాకి ప్రసాద్, భవిరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలకు మంచి స్పందన



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని శ్రీసత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక సీబీఎస్ఈ పాఠశాల జ్ఞానభారతి ఆవరణలో మంగళవారం ఆచార్య దేవోభవ అనే అంశంపై వ్యాసరచన పోటీలను 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు, ప్రకృతియే ఉత్తమ గురువు అంశంపై ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వంద మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి జోహార్‌ఖాన్, సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

రైతుకు తీపి కబురు

- వరి రైతులకు మద్దతు భరోసా
- సాధారణ రకం ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.2,183
- గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2203
- జిల్లాలో వరిసాగు విస్తీర్ణం 1,41,330 హెక్టార్లు
- ఈ–క్రాప్‌లో నమోదైన విస్తీర్ణం 1.34 లక్షల హెక్టార్లు
- ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు



రైతులు సాగు చేస్తున్న వరిపంట

ఆమదాలవలస రూరల్: వరిపంట సాగు చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు ప్రకటించింది. దళారుల ప్రమేయం లేకుండా రైతు భరోసా కేంద్రాల్లో సీఎం యాప్ ద్వారా పంటలను కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాలనే కొనుగోలు కేంద్రాలుగా మార్చుతోంది. అవసరమైన సిబ్బందిని నియమించారు. ఈ ఏడాది జిల్లాలో 1,41,330 హెక్టార్ల వరిపంటను సాగు చేయగా ఇంతవరకు 1.34 లక్షల హెక్టార్ల పంటను ఈ -క్రాప్‌లో వ్యవసాయ సిబ్బంది నమోదు చేశారు. జిల్లాలోని 30 మండలాల్లోను వరిసాగు ఆశాజనకంగా ఉంది. ఈ ఖరీఫ్‌లో 8.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. రైతులు తిండి గింజలకు ఉంచుకోగా మిగిలిన ధాన్యంను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఆర్‌బీకేల ద్వారా సాయం

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా రైతు ఇంటి వద్దకే సరఫరా చేసింది. నాట్లు వేసిన ప్పటి నుంచి వెన్ను దశ పంట వచ్చే వరకు వరి పంటకు కావాల్సిన సాగునీటిని సరఫరా చేయడంతో పాటు సబ్సిడీపై పురుగుల మందుల విక్రయాలను కూడా చేపట్టింది. ఖరీఫ్ ప్రారంభం కాక ముందే పెట్టుబడి సాయం అందజేసింది.

దళారుల బారిన పడకుండా

ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యంను నేరుగా జిల్లాలోని 656 రైతు భరోసా కేంద్రాల ద్వారా వలంటీర్ల పర్యవేక్షణలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తుంది. దళారుల మోసాలకు, తూకంలో తేడాలకు రైతులు బలి కాకుండా ప్రతి గ్రామంలో వ్యవసాయ సిబ్బంది, వలంటీర్లు ధాన్యం కొనుగోలును పర్యవేక్షించనున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని మిల్లులకు అప్పగించి మళ్లీ మిల్లర్ల ద్వారా బియ్యం సేకరించేందుకు యంత్రాంగం సిద్ధం చేసింది.

క్వింటాకు రూ. 143 ధర పెంపు

ధాన్యం మద్దతు ధరను ప్రభుత్వం క్వింటాకు రూ. 143 పెంచింది. గత ఏడాది సాధారణ రకం ధాన్యం క్వింటా రూ. 2040లకు, గ్రేడ్ ఏ రకం రూ. 2060లకు కొనుగోలు చేసింది. ఈ ఏడాది క్వింటాకు రూ. 143లు పెంచడంతో సాధారణ రకం క్వింటాకు రూ. 2183, గ్రేడ్ ఏ రకం క్వింటాకు రూ. 2203లు రైతులకు అందించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు మద్దతు ధర ప్రకటిస్తూ కరపత్రాలను విడుదల చేసింది. కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించేలా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ–క్రాప్‌లో పంట వివరాలను నమోదు చేసుకున్న రైతులు మంచి ధరలకు పంటలను అమ్మకాలు చేసుకుని గిట్టుబాటు ధర పొందగలుతారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు



ఖరీఫ్‌లో ఈ ఏడాది వరిసాగు ఆశాజనకంగా ఉంది. 8.40 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనాలు వేస్తున్నాం. రైతులు అమ్మకానికి ఉంచిన ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. రైతులు ఎక్కడా మోసపోకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తాం. ఈ ఏడాది ప్రతి క్వింటాకు రూ. 143లు ధర అదనంగా ప్రభుత్వం ప్రకటించింది. రైతులు తమ పంటలను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి తగిన గిట్టుబాటు ధర పొందాలని అవగాహన కల్పిస్తాం.

– కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి (జేడీ), శ్రీకాకుళం

పశువుల అక్రమ రవాణా అడ్డగింత



సీజ్ చేసిన లారీలు

నరసన్నపేట: జాతీయ రహదారిపై రెండు లారీల్లో అక్రమంగా 60 పశువులు తరలిస్తున్న వారిని నరసన్నపేట పోలీసులు మడపాం టోల్‌గేట్ వద్ద అడ్డుకున్నారు. వీటిని ఒడిశా రాష్ట్రం గంజాం నుంచి రాజమండ్రికి కొందరు తరలిస్తున్నారు. ముందస్తు సమాచారంతో మంగళవారం టోల్‌గేట్ వద్ద నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలంతో పాటు కొందరు పోలీసులు కాపు కాసి పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశామని, రెండు వాహనాలను సీజ్ చేశామని, ఆవులను విశాఖలోని గోశాలకు తరలించామని ఎస్ఐ తెలిపారు. అక్రమంగా పశువులను తరలించవద్దని ఎస్ఐ సూచించారు.

జాతీయ పోటీలకు ఐదుగురు ఎంపిక



ట్రోఫీతోపాటు పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ లక్ష్మణ్‌నాయుడు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సౌత్‌జోన్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో శ్రీకాకుళం నగరంలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు సత్తాచాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 1 నుంచి 3వరకు కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంకు చెందిన జిమ్మి జార్జ్ ఇండోర్ స్టేడియంలో 4వ సౌత్‌జోన్ పెన్‌కాక్ శిలాట్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో డీపీఎస్‌కు చెందిన విద్యార్థులు 5 బంగారు, 2 రజత, మరో 3 కాంస్య పతకాలతో కలిపి మొత్తం 10 పతకాలతో శభాష్ అనిపించారు. పతకాలు సాధించినవారిలో ఏ.లలిత్‌మిదిన్, పి.ఆదిత్యరాజు, జి.వెంకట్‌వరుణ్, జి.శ్రీకాంత్ సాయి ఆర్.పి.గౌరవ్, ఎన్.చరిష్మా, బి.కార్తికేయ తదితరులు ఉన్నారు. పాఠశాల డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ తరిని అర్జున్ చక్రవర్తి విద్యార్థులను, కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడులను ప్రత్యేకంగా అభినందించారు. పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు డిసెంబర్‌లో పాట్నాలో జరగబోయే 11వ నేషనల్ సబ్–జూనియర్స్, జూనియర్స్ పోటీలకు అర్హత సాధించారు.

అత్యాచార కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలుశిక్ష

పార్వతీపురంటౌన్/సీతంపేట: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితునికి 20 సంవత్సరాల జైలు శిక్షను విధిస్తూ శ్రీకాకుళం ఒకటో అదనపు జడ్జి కోర్టు, పోక్సో కోర్టు ఇన్‌చార్జి శ్రీదేవి మంగళవారం తీర్పు వెలువరించారని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తెలిపారు.

కేసు వివరాలు ఇలా..

సీతంపేట మండలం సోమగండి గ్రామానికి చెందిన బాధితురాలి తల్లి 2018 ఏప్రిల్ 25వ తేదీన తన ఎనిమిదేళ్ల కుమార్తెపై అదే గ్రామానికి చెందిన గంటా సంతోష్‌కుమార్ లైంగిక దాడిచేశాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన మేరకు నిందితునికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. బాధితురాలికి రూ.4లక్షల నష్టపరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కేసులో అప్పటి పాలకొండ సబ్‌డివిజన్ దర్యాప్తు అధికారి జి.స్వరూపారాణి, దిశసెల్ డీఎస్పీ ఎస్.ఆర్.హర్షిత, పీపీ కొమర శంకరరావు, రమణ కృషితో నేరం రుజువైందన్నారు. పక్కా అధారాలతో చార్జీషీట్ దాఖలు చేసిన సీతంపేట ఎస్ఐ ఎ.నీలకంఠారావు, ఏఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ ఏవీజీ నాయుడును ఆయన అభినందించారు.

నేడు అండర్-19 ఫుట్ బాల్ క్రీడాకారుల ఎంపికలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజ్ మైదానంలో బుధవారం రాష్ట్రస్థాయి అండర్-19 బాలబాలికల ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీడీ ఎస్.రామన్న తెలిపారు. పాఠశాలలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు ఎంపికలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ నంబర్ 6302546128 ను సంప్రదించాలని సూచించారు.

వీధి కుక్కల నియంత్రణపై చర్యలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వీధి కుక్కలను అదుపు చేయటం చాలా అవసరమని, ఈ విషయంపై మరింతగా శ్రమించాలని శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. ఖాజీపేట ఏబీసీ సెంటర్‌లో మంగళవారం జరిగిన ఏబీసీ మానిటరింగ్ కమిటీ నెలవారీ సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. శ్రీకాకుళం నగరాన్ని ర్యాబిస్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గ్రీన్ మెర్సీ సంస్థ, నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన వీధి కుక్కల జనన నియంత్రణ కార్యక్రమం అమలు తీరుపై కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది.

అనంతరం ఆర్గాన్ కౌంట్ నిర్వహించి, 122 వీధి కుక్కలకు సెప్టెంబర్‌లో సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు జరిగాయని కమిటీ నిర్ధారించింది. కార్యక్రమంలో నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకట రావు, పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కృష్ణారావు, అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్ డాక్టర్ హేమంతకుమార్, నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బంది, ఏబీసీ సెంటర్ వెటర్నరీ సర్జన్లు డాక్టర్ సాయి ఆదిత్య, డాక్టర్ హర్షవర్ధన్ కుమార్ పాల్, గ్రీన్ మెర్సీ సీఈఓ రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దాసన్న డబుల్ హ్యాట్రిక్

- మరోసారి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షునిగా ధర్మాన కృష్ణదాస్
- వరుసగా ఆరోసారి జిల్లా అధ్యక్షునిగా కృష్ణదాస్ ఏకగ్రీవంగా ఎన్నిక



జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు, పీడీలు, పీఈటీలతో ధర్మాన కృష్ణదాస్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షునిగా నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన డబుల్ హ్యాట్రిక్ కొట్టారు. శ్రీకాకుళం జిల్లాతోపాటు రాష్ట్రంలోనే ఓ క్రీడా సంఘ అధ్యక్షునిగా వరుసగా ఆరు పర్యాయాలు ఏకగ్రీవంగా ఎన్నికైన వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఫైఫ్లోర్‌లో ఉన్న జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి

ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ ఎన్నికైన నూతన కార్యవర్గ బాధ్యులను అభినందించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ఎవరు ముందుకొచ్చినా రాజకీయాలకు అతీతంగా సాదరంగా, ప్రేమతో ఆహ్వానిస్తామని చెప్పారు. రాజకీయాలకు, క్రీడలతో సంబంధం ఉండకూడదనేదే ముందు నుంచీ తన అభిప్రాయమని చెప్పారు. జిల్లాలో వాలీబాల్‌కు మంచి ఆదరణ ఉందని, దాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందని.. సమష్టిగా ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, క్రీడల కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు నేడు పుష్కలంగా లభిస్తున్నాయంటే అది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవేనని చెప్పారు. ప్రభుత్వాలతోపాటు దాతలు, పారిశ్రామిక వేత్తలు చేయూతను అందించి క్రీడలను విస్తరించాలని, క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. శాప్ తరఫున, వాలీబాల్, ఒలింపిక్ సంఘం తరపున ముఖ్య ప్రతినిధులు హాజరై పరిశీలకులుగా, ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, సూర శ్రీను, పీఈటీ సంఘ నాయులు ఎంవీ రమణ, డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీదర్‌రావు, పీడీలు, పీఈటీలు, కృష్ణదాస్ అభిమానులు, వాలీబాల్ అభిమానులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఇదే

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షునిగా ధర్మాన కృష్ణదాస్, ఉపాధ్యక్షులుగా వై.పోలినాయుడు, డి.లక్ష్మదాస్, ప్రధాన కార్యదర్శిగా కె.రామచంద్రుడు, సంయుక్త కార్యదర్శులుగా ఎన్వీ రమణ, టి.రవి, కోశాధికారిగా బి.సతీష్, కార్యవర్గ సభ్యులుగా వై.రమణ, బీహెచ్ మాధురి, కె.సుశీల, వై.తవిటినాయుడు, సీహెచ్ రాము, ఆర్.రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రజతాలంకరణ



ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణి దుర్గమ్మను మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. దసరా ఉత్సవాలు రానున్న నేపథ్యంలో ఆలయానికి భక్తుల రాక పెరుగుతోంది. దీంతో మంగళవారం అమ్మను వెండి ఆభరణాలు, పూలమాలలతో అలంకరించారు.

– ఎల్ఎన్ పేట

పోలీసులపై టీడీపీ దురుసు ప్రవర్తన



పోలీసు వాహనాన్ని చుట్టుముట్టిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలో మంగళవారం సాయంత్రం పోలీసులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ నాయకులు, కేడర్ కొన్ని రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం నాయకులు, క్యాడర్ జిల్లా టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా టీడీపీ ఆఫీసు వద్ద దీక్షలో కూర్చున్న కూన రవికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పోలీసులు వారిస్తున్నా వినకుండా తోసుకుంటూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా ఓ ఐదుగురిని పోలీసులు వ్యాన్‌లో ఎక్కించారు. 80 అడుగుల రోడ్డులోని ఎంపీ కార్యాలయం సమీపానికి రాగానే నలుగురు సీఐలు వెళ్తున్న పోలీసు వాహనాన్ని టీడీపీ కార్యకర్తలు, నాయకులు అడ్డుకుని వాహనం తలుపులు విరిచేందుకు ప్రయత్నిస్తూ రభస సృష్టించారు. ఈ సమయంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌బాబు అక్కడికి రావటంతో అంతా ఆయన వద్దకు పరుగులు తీశారు.

పోలీసులు ఎమ్మెల్యే అశోక్‌బాబును అరెస్టు చేసి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ అశోక్‌బాబు పోలీసులతో వాదనకు దిగారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు నగరంలో ర్యాలీ చేశారు. ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, గౌతు శిరీష, మెండ దాసునాయుడు, మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థినుల భోజనం పరిశీలిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల సమన్వయాధికారి బాలాజీ

పాతపట్నం: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో డార్మిటరీ, భోజన శాల, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, పదో తరగతి, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు రావాలన్నారు. విద్యార్థులకు ఆంగ్లంపై పలు పశ్నలు వేసి, జవాబులు రాబట్టారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాలు పరిశీలించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణతార, కంచిలి ప్రిన్సిపాల్ బి.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజేతలకు కలెక్టర్ అభినందన



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ వారు విజయవాడలో సెప్టెంబర్ 30న నిర్వహించిన రాష్ట్ర స్థాయి 5 కె రన్ మారథాన్‌లో జిల్లాకు చెందిన విజేతలను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మంగళవారం ఆయన చాంబర్‌లో అభినందించారు. ఇచ్ఛాపురానికి చెందిన సాయి కిరణ్‌సాహు రెండో స్థానంలో నిలిచారు. అలాగే శ్రీకాకుళానికి చెందిన సంతోష్ కన్సోలేషన్ బహుమతి గెలుపొందారు. వీరిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ కోచ్ శ్రీధర్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటిపై పిడుగుపాటు

బూర్జ: మండలంలో గల గంగంపేట గ్రామంలో పిడుగు పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మంగళవారం సాయంత్రం గ్రామంలో ఉరుములు మెరుపులతో వర్షం పడింది. ఈ వర్షానికి గ్రామానికి చెందిన పీస పెంటయ్య శ్లాబ్ ఇంటిపై పిడుగు పడడంతో శ్లాబ్ కొంతమేర బీటలు వారింది. ఇంటిలో ఉన్న ఎలక్ట్రికల్ సామాన్లు, విద్యుత్ మీటరు, ఫ్రిజ్, టీవీ పూర్తిగా ధ్వంసమయ్యాయి.